అధికారుల నిర్లక్ష్యం... రైతులకు శాపం


ఉమ్మలాడలో సాగునీటి కాలువలో మురుగునీటి ప్రవాహం


మునగపాక బీసీ కాలనీని ఆనుకొని తూటికాడతో దర్శనమిస్తున్న సాగునీటి కాలువ

- అధ్వానంగా సాగునీటి కాలువలు
- ఖరీఫ్‌కు తప్పని కష్టాలు

మునగపాక : మునగపాక మండలంలో ఎక్కువ మందికి వ్యవసాయమే జీవనాధారం. అయితే సాగునీటి కాలువల పరిస్థితి రైతులకు కష్టాలు తెచ్చి పెడుతున్నాయి. కాలువల్లో సాగునీటి ప్రవాహం సక్రమంగా జరగకపోవడంతో రైతులు వ్యవసాయం అంటేనే పెదవి విరుస్తున్నారు. సీజన్‌లో పట్టించుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వానికి నివేదికలు అందజేయడం తప్ప రైతాంగానికి మేలు చేకూర్చడంలో అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సాగునీటి కాలువలే ఆధారం...

పంటల సాగుకు సాగునీటి కాలువలే ఆధారంగా నిలవాల్సి ఉంది. ప్రతి ఏటా సాగునీటి కాలువలు, చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టని కారణంగా పంటలకు నీరందని పరిస్థితి నెలకొంది. మండల వ్యాప్తంగా చెరకు, వరితో పాటు అపరాల సాగుపై దృష్టి సారిస్తుంటారు రైతులు. మెజార్టీ రైతులకు సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీరే ఆధారం. అయితే పంట పొలాలకు అందించే సాగునీటి విషయంలో అధికారుల నిర్లక్ష్య ధోరణే అన్న ఆరోపణలు ఉన్నాయి. మునగపాకలోని కృష్ణంరాజు కాలువ, తోటాడ ఆవ కాలువ, గణపర్తి–చూచుకొండ వద్ద రోలుగెడ్డ, మునగపాకలోని శీలప్పన చెరువు అలాగే చెరువు కాలువ, బీసీ కాలనీని ఆనుకొని కాలువ తదితర సాగునీటి వనరుల ఆధారంగా పంటలు పండిస్తుంటారు. అయితే ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించే అవకాశం లేకపోతుంది.

స్వరూపం కోల్పోతున్న సాగునీటి వనరులు

పలు చోట్ల కాలువలు స్వరూపం కోల్పోతున్నాయి. ఉమ్మలాడ వద్ద సాగునీటి కాలువల గుండా మురుగు నీరు ప్రవహిస్తుంది. పలు ప్రాంతాల్లో చెరువులు, గెడ్డల్లో తూటుగడ్డి పెరిగిపోతుంది. దీంతో ఎగువ నుంచి నీటి ప్రవాహానికి అంతరాయం కలుగుతుంది. ఫలితంగా పంట పొలాలకు సాగునీరు అందే పరిస్థితులు లేవు. మండల వ్యాప్తంగా 4674 హెక్టార్లకు పైగా పంటల సాగు జరుగుతుంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఎగువ నుంచి వచ్చే నీరు దిగువ ప్రాంతాలకు ప్రవహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

ఏళ్ల తరబడి సాగునీటి కాలువల అభివృద్ధికి అధికారులు ప్రభుత్వాలకు నివేదికలు పంపుతూనే ఉన్నారు. అంతేకాని క్షేత్రస్థాయిలో రైతుకు ఒరిగిందేమీ లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం సాగునీటి కాలువల ఆధారంగా పంటలు సాగించే రైతులు మాత్రం సాగునీటి రంగం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి సాగునీటి రంగంపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పూడికతీత చేపట్టాలి



సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో పంటల సాగుకు ఇబ్బంది ఉండదు. ఎగువ నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీటి ప్రవాహం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. సీజన్‌కు ముందుగానే అధికారులు సాగునీటి రంగ అభివృద్ధిపై చర్యలు చేపట్టాలి.

– కాండ్రేగుల కిరణ్‌కుమార్, రైతు, చూచుకొండ

ఆక్రమణల్లో కాలువలు



ప్రభుత్వాలు మారుతున్న రైతుల తలరాతలు మారడం లేదు. సాగునీటి కాలువల ద్వారా పంటలు సాగు చేసే రైతులకు కష్టాలు తప్పడం లేదు. కాలువల్లో తూటికాడ పెరిగిపోవడం, కాలువల ఆక్రమణల కారణంగా సాగునీరు ప్రవహించడం లేదు. ఎప్పటికప్పుడు సాగునీటి వనరులను మెరుగుపరచాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం విచారకరం.

– టెక్కలి జగ్గారావు, సీపీఎం నేత, మునగపాక

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

మండలంలోని సాగునీటి వనరుల అభివృద్ధికి అవసరమయ్యే చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు కాలువలకు సంబంధించి అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. కాలువలను మెరుగుపరిచి సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నా. కొన్ని చోట్ల కాలువల్లో చెత్త వేయడం అలాగే మురుగునీరు వదిలేస్తున్నారు. దీంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తప్పడం లేదు.

– లోకేష్, నీటిపారుదల శాఖ ఏఈ

క్లుప్తంగా

ఘనంగా లైబ్రేరియన్ డే


ఎస్ఆర్ రంగనాథం చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం: అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో సోమవారం లైబ్రేరియన్ డే వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్.ఆర్.రంగనాథం చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు గ్రంథాలయ అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అచ్యుత విద్యా సంస్థల అధినేత శేషగిరి, స్థానిక గ్రంథాలయ అధికారి కోటేశ్వర రావు, ఆనంద్, ఎల్.రమణ, కె.శ్రీనివాసరావు, కె.జనార్దన్, కె. వరలక్ష్మి, కె.మల్లిఖార్జున్‌రావు, రామ్‌జీ, కిరణ్, జగన్, అప్పలనర్స పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌కు బెల్ వితరణ


పాటిపల్లి మోడల్ స్కూల్‌కు బెల్ వితరణ చేస్తున్న దృశ్యం

మునగపాక : పాటిపల్లి మోడల్ స్కూల్‌కు బెల్ వితరణగా అందజేశారు. మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆశ–వెంకటప్పారావు దంపతుల కుమార్తె మోక్షిత మాన్వి పేరిట బెల్‌ను సోమవారం అందజేశారు. పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో పీలా వెంకటప్పారావు పాల్గొన్నారు.

ఇష్టానుసారం చెత్త వేస్తే జరిమానా


మునగపాకలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : మునగపాక పంచాయతీ పరిధి లో ఎక్కడైనా బహిరంగంగా ప్లాస్టిక్, చెత్త వేస్తే జరిమానా తప్పదని సర్పంచ్ దిమ్మల అప్పారావు హెచ్చరించారు. ఇందుకు సంబంధించి గ్రామంలో పలు చోట్ల సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలో ఎక్కడైనా బహిరంగంగా ప్లాస్టిక్ గాని చెత్త గాని వేస్తే రూ.5వేల మేర అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. అలాగే సమాచారం ఇచ్చిన వారికి రూ.2వేల మేర నగదు బహుమతి అందజేస్తామన్నారు. ప్రజలు పంచాయతీ తీసుకునే నిర్ణయానికి సహకరించాలని అప్పారావు కోరారు.

చిన్నారులకు ఆటల పోటీలు


చిన్నారులకు కుర్చీలాట నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేటలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని పిల్లలకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్ వంటి పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.లక్ష్మి మాట్లాడుతూ చిన్నారుల్లో స్వాతంత్ర్య స్ఫూర్తి కలిగించేందుకు ప్రతి ఏటా ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధూళి సిరి, ధూళి పావని, విఘ్నేశ్వరి, అరుణ్ పాల్గొన్నారు.

గోకులం షెడ్ల ఏర్పాటుకు దరఖాస్తులు

మాడుగుల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద 25 గోకులం షెడ్ల మంజూరు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు తెలిపారు. ఈ పథకంలో పశువుల షెడ్లకు 90 శాతం రాయితీ, గొర్రెలు, కోళ్ల షెడ్లకు 70 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. అర్హత కలిగిన రైతులు దరఖాస్తుకు ఆధార్ కార్డు, ఉపాధి పని పుస్తకం, షెడ్లు నిర్మించే స్థలం వన్‌బీ, రెండు ఫొటోలు, రేషన్‌కార్డు జెరాక్స్, సంబంధిత అధికారుల ధ్రువీకరణ పత్రం, గ్రామసభ తీర్మానాలు ఉండాలన్నారు.

సర్దుబాటు కౌన్సెలింగ్ వాయిదా


ఫ్యాప్టో తరఫున ఎంఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

నక్కపల్లి: మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియకు సంబంధించి సోమవారం జరగాల్సిన కౌన్సెలింగ్ వాయిదా పడిందని మండల విద్యాశాఖాధికారి కుంచం నరేష్ తెలిపారు. సర్ ప్లస్ టీచర్లను అవసరమైన చోట సర్దుబాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. సోమవారం నుంచి మండలాల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవో లోపభూయిష్టంగా ఉందని, ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున జీవోలో మార్పులు చేసి తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో పలు ఉపాధ్యాయ సంఘాలు ఎంఈవోకు వినతి పత్రాలు అందజేశారు. అప్పటి వరకు కౌన్సెలింగ్ వాయిదా వేయాలని కోరడంతో సోమవారం జరగాల్సిన కౌన్సెలింగ్‌ను ఈనెల 17 వరకు వాయిదా వేస్తున్నట్టు ఎంఈవో తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోలో మార్పులు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయన్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారులకు తెలియజేస్తున్నామని తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత కౌన్సెలింగ్‌పై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి


గెడ్డపాలెం గ్రామంలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


ఎస్.రాయవరంలో వైద్య సేవలందిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని పెనుగొల్లు పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాసరావు అన్నారు. గెడ్డపాలెం గ్రామంలో సోమవారం క్షయ రహిత సమాజం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ అభిలాష్, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ పర్యవేక్షకులు షేక్ అమీర్ షాజిద్ పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా..

మండల కేంద్రంలో స్టాప్ డయేరియా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు కురిసి కొత్త నీరు చేరుకుతున్న తరుణంలో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. వైద్య శిబిరం నిర్వహించి పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

16 నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

యలమంచిలి రూరల్ : భూములకు సంబంధించిన ఫిర్యాదులు,అంశాలను పరిష్కరించేందుకు ఈ నెల 16 నుంచి యలమంచిలి పట్టణం, మండలంలో గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్. రాణీ అమ్మాజీ సోమవారం విలేకరులకు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రామాల్లో సదస్సులు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్టు ఆమె తెలిపారు. 16న కొక్కిరాపల్లి,17న తురంగలపాలెం, 19న జంపపాలెం, 20న సోమలింగపాలెం, 21న గొల్లగుంట, 22న కట్టుపాలెం, 23న తెరువుపల్లి, 24న యర్రవరం, 27న రేగుపాలెం, 28న కృష్ణాపురం, 29న పులపర్తి, 30న బయ్యవరం, 31న పీఎన్ ఆర్‌పేట, సెప్టెంబరు 2న ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఏటికొప్పాక సెప్టెంబరు 3న ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో యలమంచిలి పట్టణంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సదస్సుల్లో గ్రామ స్థాయిలో భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికి అధికారులు నిర్ణీత గడువు లోగా చర్యలు తీసుకోనున్నారు. భూ కబ్జాలు, 22ఏ దుర్వినియోగం వంటి సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు వినతి పత్రాలు ఇవ్వవచ్చు. ఫిర్యాదుల స్వీకరణకు భూముల వ్యవహారాలతో సంబంధమున్న అటవీ, దేవదాయ, వక్ఫ్ తదితర శాఖల అధికారులు సదస్సులకు హాజరవుతారని తహసీల్దార్ తెలిపారు.

ఘనంగా ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


జెండాను ఆవిష్కరించిన ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు రావు జగ్గారావు

నక్కపల్లి : పాయకరావుపేట పట్టణంలో ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం బీసీ మహిళ వసతి గృహంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు జగ్గారావు ఏఐఎస్ఎఫ్ జెండాను ఎగురవేశారు. ఏఐఎస్ఎఫ్ పాయకరావుపేట డివిజన్ కార్యదర్శి జగదీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జగ్గారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యమే ధ్యేయంగా దేశంలోనే మొట్టమొదటి విద్యార్థి సంఘంగా 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఏర్పడి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిందన్నారు. నేటికి 88 సంవత్సరాలు పూర్తి చేసుకుని 89వ సంవత్సరంలోనికి అడుగుపెడుతూ ఎంతో గొప్ప చరిత్ర ఉన్నటువంటి ఏఐఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం జరుపుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని అన్నారు. ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ 89 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థి సమస్యలపై ఏఐఎస్ఎఫ్ భవిష్యత్ కార్యక్రమానికి శ్రీకారం చూడుతుందని అన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి, అలాగే పాయకరావుపేట కేంద్రంగా ప్రభుత్వ కళాశాల వసతి గృహం సొంత భవనం ఏర్పాటుకు ఏఐఎస్ఎఫ్ పోరాడుతోందని అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సీత లత, ప్రసాద్, ఏసు, జగన్ పాల్గొన్నారు.

గంగాలమ్మతల్లి గుడి పోస్టర్ ఆవిష్కరణ


గంగాలమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మూలపేట గంగాలమ్మ తల్లి దేవాలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ నెల 19న మండలంలోని మూలపేటలో గంగాలమ్మతల్లి గుడి ప్రారంభోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా భాగస్వాములు కావాలన్నారు. సోదరభావంతో వ్యవహరించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగప్పలనాయుడు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్, నాగేశ్వరరావు, జగన్నాథరావు, రమేష్, గాంధీ, బొడ్డేడ లిల్లీ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం మాదే


వీసం రామకృష్ణ

నక్కపల్లి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీ దేనని రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గెలిచేందుకు అవసరమైన సంఖ్యాబలం లేనప్పటికీ కూటమి పార్టీలు అభ్యర్థిని బరిలోకి దింపుతున్నాయన్నారు. గెలవలేమనే భయంతోనే ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన పీలా గోవిందు, గండి బాబ్జి వంటి వారిని ప్రకటించకుండా బైరా దిలీప్‌ను అభ్యర్థిగా ప్రకటించాలని ప్రయత్నిస్తున్నారన్నారు. తమ పార్టీ నుంచి గెలుపొందిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలంతా తమతోనే ఉన్నారన్నారు. ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఓటమి భయంతోనే చివరి నిమిషం వరకు తెలుగుదేశంపార్టీ అభ్యర్థిని ప్రకటించ లేకపోయిందన్నారు. అభ్యర్థి ఎవరైనా గెలుపు మాత్రం మా పార్టీదేనన్నారు. కూటమి ప్రలోభాలకు తలొగ్గేందుకు ఎంపీటీసీలు ఎవరూ మొగ్గు చూపడం లేదన్నారు.

విద్యార్థులకు నిత్యావసర సరకుల వితరణ


పాఠశాల విద్యార్థులతో రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు

అచ్యుతాపురం: అచ్యుతాపురంలోని సమీకృత పిల్లల పాఠశాల విద్యార్థులకు నెల రోజులకు అవసరమైన రేషన్ సరుకుల్ని రాంకీ ఫౌండేషన్ సోమవారం అందజేసింది. రాంకీ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. విశాఖ ఫార్మసిటీ డీజీఎం గిరిధర్ భక్షి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, పాఠశాల నిర్వాహకులు పట్నాయక్, శ్రీనివాస రెడ్డి, ఎస్.రాజేశ్వరి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై నేడు సదస్సు

అచ్యుతాపురం : మండలంలోని అచ్యుత కళాశాలలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ,ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ ప్రతినిధి మారిసెట్టి వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ అంశంపై నిర్వహించనున్న సెమినార్‌లో మేధావి వర్గాలకు చెందిన వారు, ఇతర ప్రతినిధులు పాల్గొని చర్చించవచ్చని ఆయన పేర్కొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

నక్కపల్లి : మండలంలో ఏపీఐఐసీ వారి భూసేకరణలో నిర్వాశితులు, రైతుల సమస్యలు పరిష్కరిస్తామని మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ తెలిపారు. సోమవారం ఆయన భూసేకరణ జరిగిన చందనాడ, డీఎల్‌పురం, రాజయ్యపేట గ్రామాలకు చెందిన రైతులతో చందనాడలో సమావేశం నిర్వహించారు. విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా ఐదు వేల ఎకరాలు సేకరించిన సంగతి తెలిసిందేనన్నారు. నష్టపరిహారం, ప్రత్యేక ప్యాకేజీ చెల్లింపుల్లో కొన్ని సమస్యలు ఉన్నాయన్నారు. నిర్వాసితుల సమస్యలను ఇటీవలే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో అభివృద్ధికి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు పెదపూడి శంకర్రావు, కాళ్ల శ్రీను, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలిరూరల్: పురుషోత్తపురం 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పీఎస్ఆర్‌పేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా మండలంలో పురుషోత్తపురం, పులపర్తి, బయ్యవరం ,పీఎస్ఆర్‌పేట గ్రామాలకు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ మీడియాకు తెలిపారు. ఈ గ్రామాల పరిధిలో అవకాశం ఉన్నచోట వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు మంగళవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఇస్తామన్నారు. అదే విధంగా దార్లపూడి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కొత్తలి, ఏటికొప్పాక ఫీడర్‌ల పరిధిలో ఏటికొప్పాక, ములకలాపల్లి, కొత్తలి, పేరంటాళ్లపాలెం, మన్యంపాలెం గ్రామాలకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వ్యవసాయ విద్యుత్ కలెక్షన్లకు ఉదయం 6 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఇస్తామన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు,రైతులు గమనించాలని ఆయన సూచించారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ



తూటిపాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మాకవరపాలెం: మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ సోమవారం తూటిపాలంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నాషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాము మాట్లాడుతూ దేశానికి యువతే ఒక శక్తి అని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. వాటి వల్ల యువత జీవితం నాశనం అవుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

సంఘ అర్హతను బట్టి రుణ మంజూరు


రుణ మంజూరుపై అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ పరమేశ్వర్రావు

రోలుగుంట: ప్రతి సభ్యురాలు పేరున బ్యాంకు ఖాతా తెరచి కొన్ని నెలలపాటు పొదుపు కట్టాలని, ఆ తర్వాత సంఘ అర్హతను బట్టి రుణాలు మంజూరు చేస్తామని స్థానిక ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ పి.పరమేశ్వర్రావు తెలిపారు. స్థానిక బ్రాంచ్ ఆఫీసులో డ్వాక్రా సంఘాల ఏర్పాటు, రుణాలు మంజూరుపై సభ్యులకు అవగాహన కల్పించారు. కొండపాలెం శివారు వెలంకాయలపాలెంలో కొత్తగా ఏర్పాటైన డ్వాక్రా సభ్యులు, వెలుగు ప్రతినిధులు భవాని, నాగేశ్వరరావు బ్రాంచి మేనేజరును సోమవారం కలిశారు. వారి వివరాలు బ్రాంచి మేనేజరు కంప్యూటర్లో నమోదు చేసుకున్నారు.

‘వర్గీకరణతో దళితులకు అన్యాయం’


మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ (డీబీపీ) ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ

నక్కపల్లి : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రీమీలేయర్ విధానాన్ని రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్రాల్లో మోదీ, బాబు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఈ నెల 21న జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని, పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనల ద్వారా పాలకులపై ఒత్తిడి తేవడానికి ఉద్యమం ఉధృతం చేయాలని దళిత బహుజన పార్టీ (డీబీపీ) ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షురాలు దాసరి అన్నపూర్ణ పిలుపు ఇచ్చారు. పాయకరావుపేటలోని పరివర్తన నిలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దళితుల భవిష్యత్తుకు పెను ప్రమాదం వర్గీకరణ ద్వారా రాబోతుందన్నారు. దోపిడీ కుల పాలకులు చేసిన సామాజిక కుట్రల వల్లే ఈ వర్గీకరణవాదం అన్నారు. సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దువ్వాడ దావీదు, మాల మహానాడు అనకాపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు తట్టా శ్రీనివాసరావు, పాయకరావుపేట అసెంబ్లీ ఇంచార్జ్ బడుగు అచ్చారావు, టౌన్ శాఖ అధ్యక్షులు రావాడ జాన్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజు

నర్సీపట్నం: అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి సౌజన్యంతో సమీద స్వచ్ఛంద సంస్థ వారు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.రాజు మాట్లాడుతూ లైంగికంగా ఎయిడ్స్ సక్రమిస్తుందన్నారు. విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్సై సుధాకర్, ఎం.కె.రామచంద్రరావు, డి.ఎస్.ఆర్.సి. కౌన్సిలర్ గణపతి, ఎ.ఆర్.టి. కౌన్సిలర్ ప్రసాద్, ఐ.సి.టి.సి. కౌన్సిలర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తనమూనాల సేకరణ

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రక్త నమూనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా 160 మంది విద్యార్థులకు ఏఎన్ఎం జి.సత్యవతి రక్తనమూనాలు సేకరించారు. వీరిలో అయిదుగురికి రక్త శాతం తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. వారిలో రక్త శాతం పెరుగుదలకు సంబంధించిన ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు.